


తమ సంపదలో సగానికన్నా ఎక్కువ మొత్తాన్ని విరాళాలుగా ఇస్తామని ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు నందన్ నీలేకని, ఆయన భార్య రోహిణి నీలేకని ప్రకటించారు. భారత సంతతికి చెందిన మరో ముగ్గురు కోటీశ్వరులు కూడా ఇదే వాగ్దానం చేశారు. బిల్ గేట్స్ ఆయన భార్య మెలిండా గేట్స్, వారెన్ బఫెట్‌లు నెలకొల్పిన గివింగ్ ప్లెడ్జ్(ప్రతిజ్ఞ చేద్దాం) అనే స్వచ్ఛంద సంస్థకు ఈ మేరకు హామీ ఇచ్చారు. 40 మంది అమెరికన్ కోటీశ్వరులతో 2010లో నెలకొల్పిన ఈ సంస్థలో ఇంతవరకు 22 దేశాలకు చెందిన 183 మంది చేరారు. తమ జీవిత కాలంలోగానీ, వీలునామాల ద్వారాగానీ సంపదలో సగంకన్నా అధికమొత్తాన్ని సేవా కార్యక్రమాల కోసం ఇస్తామని వీరంతా ప్రకటించారు. ఈ ఏడాది 14 మంది కోటీశ్వరులు విరాళాలు ఇస్తామని ప్రకటించగా, అందులో నీలేకని దంపతులతో పాటు భారత సంతతికి చెందిన అనీల్-అల్లిసన్ భూస్రీ, షంషీర్-శబీనా వయాలిల్, బీఆర్ శెట్టి-చంద్రముఖి రఘురాం శెట్టి ఉన్నారు.

- నీలేకని దంపతులు ఏక్‌స్టెప్ పేరుతో లాభాపేక్ష రహిత సంస్థను నడుపుతున్నారు. దీని ద్వారా 2 కోట్ల మంది ప్రాథమిక పాఠశాలల స్థాయి పిల్లల అభ్యాసన స్థాయిని మెరుగుపరచడానికి కృషి చేస్తున్నారు. అర్ఘ్యం అనే మరో సంస్థ ద్వారా రోహిణి నిలేకని గ్రామాల్లో తాగునీరు, పారిశుద్ధ్యం మెరుగునకు ప్రయత్నం చేస్తున్నారు. వారు గివింగ్ ప్లెడ్జ్ సంస్థకు లేఖ రాస్తూ భగవద్గీతను ఉటంకించారు. 'పనిచేయడానికే మనకు అధికారం ఉంది. కానీ, అందుకు తక్షణ ఫలితం పొందే అధికారం లేదు. ప్రత్యక్ష ఫలితం పొందలేమన్న భయంతో పనిచేయడాన్ని ఆపివేయకూడదు. ఈ ఆదర్శాన్ని పాటించడానికే మేం ప్రతిజ్ఞ చేస్తున్నాం' అని పేర్కొన్నారు.
- అమెరికాకు చెందిన అనీల్ బూస్రీ.. వర్క్‌డ్ సాఫ్ట్‌వేర్ సంస్థ సహ వ్యవస్థాపకుడు. ఫోర్బ్స్ లెక్కల ప్రకారం ఆయన సంపద 1.8 బిలియన్ డాలర్లు (రూ.12,124 కోట్లు). ఇంటెల్ సంస్థ డైరెక్టర్ల బోర్డులో సభ్యునిగా ఉంటున్నారు. అల్లిసన్ థోరెసన్ బూస్రీ సాంకేతిక సంస్థల్లో ప్రధానంగా పెట్టుబడులు పెడుతున్నారు.
- యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌కు చెందిన షంషీర్ వయాలిల్, శబీనాలు వీపీఎస్ హెల్త్‌కేర్ పేరుతో ఆసుపత్రులు నిర్వహిస్తున్నారు. నాలుగు దేశాల్లో 22 ఆసుపత్రులు, 125 ఆరోగ్య కేంద్రాలతో పాటు మందుల తయారీ సంస్థ ఉంది. 'విజయం అంటే ప్రజల జీవితాల్లో గుర్తించదగ్గ, సుస్థిర మార్పులు తీసుకురావడమే'నని ప్లెడ్జ్ సంస్థకు రాసిన లేఖలో పేర్కొన్నారు.
- యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌కు చెందిన బీఆర్ శెట్టి దంపతులు కూడా ఎన్ఎంసీ హెల్త్ పేరుతో 13 దేశాల్లో ఆసుపత్రులు నిర్వహిస్తున్నారు. బీఆర్ లైఫ్ పేరుతో భారత్, నేపాల్, ఈజిప్టుల్లో పేదలకు వైద్య సేవలు అందిస్తున్నారు. పలు విద్యా సంస్థలు కూడా నిర్వహిస్తున్నారు.